# కథ

# పాత పాఠం

ఏ ముహూర్తంలో నర్సింగ్‌హోమ్ ప్రారంభించిందోకానీ డాక్టర్ గాయత్రి అనతికాలంలోనే నగరంలో ప్రముఖ గైనకాలజిస్టుగా ఖ్యాతి గడించింది. గాయత్రి హస్త స్పర్శ తగిలితే చాలు గొడ్రాలయినా గర్భవతి అవుతుంది. ఆమె చెయ్యిపడితే ఎంత క్లిష్టమైన కాన్పయినా సునాయాసంగా సుఖంగా జరిగిపోతుంది.

పేషంట్లను ఆమె ట్రీట్‌చేసే విధానం చూపరులను ముగ్ధులను చేస్తుంది. భూదేవిని మించిన సహనం, పేషంట్ల కుటుంబంలో మనిషిలా వారిపట్ల ఆమె చూపే ఆప్యాయత, అందరినీ ఒకేవిధంగా ఆదరించడం ఆమెను చాలా బిజీ డాక్టర్ని చేశాయి.

ఆమె చిరునవ్వు ఎంతటివారినైనా కట్టిపడేస్తుంది. తియ్యని ఆమె మాటలకు ఎదురు చెప్పాలనిపించదు.

రోజులాగే కాబోయే మాతృమూర్తులతో కారిడార్ కిక్కిరిసి ఉంది. నర్సులు హడావుడిగా తిరుగుతున్నారు. కన్సల్టేషన్ రూమ్ డోర్ వద్ద ఒకావిడ కూర్చుని ఒక్కొక్కరినే లోపలకు పంపుతున్నది.

గర్భిణులకు తోడుగా వచ్చినవారు నిముషానికోమారు గడియారం వంక చూసుకుంటున్నారు. గాయత్రి టైమింగ్స్‌ను చాలా ఖచ్చితంగా పాటిస్తుంది. ఉదయం తొమ్మిది గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మళ్ళీ సాయంత్రం ఐదుగంటల నుండి ఏడుగంటల వరకు మాత్రమే కన్సల్టేషన్ అవర్స్. తరువాత రాత్రి పదిగంటల వరకు ఆపరేషన్స్. ఒంటిగంటలోపు దర్శనం దొరక్కపోతే ఐదుగంటలదాకా పడిగాపులు కాయాల్సిందే.

కొంతమంది మెడికల్ రిప్రజెంటేటివ్స్ కూడా డాక్టర్ దర్శనం కొరకు అసహనంగా ఎదురుచూస్తున్నారు. ఒక పేషంట్ బయటకు వచ్చినప్పుడల్లా ఒక్క నిముషంలో వస్తామని వాళ్ళు లోపలికెళ్ళడానికి ప్రయత్నించడం, పేషంట్లు వారితో చిరుఘర్షణ పడటం ఒక తంతులా సాగుతున్నది. ఎవరినీ వారించలేక నర్సులు ఇబ్బంది పడుతున్నారు.

"మనకు లోపలకు వెళ్ళడం కుదురుతుందా నాన్నా?" అడిగింది వసంత.

"తప్పకుండానమ్మా. కంగారుపడకు" అనునయంగా అన్నాడు రామారావు.

"తొలి కాన్పాండీ?" పక్కనే కూర్చున్నామె అడిగింది రామారావును.

"అవునమ్మా. మంచి పేరున్న డాక్టరని ఇక్కడికి తీసుకొచ్చాను" అన్నాడు రామారావు.

"ఆమె హస్తవాసి చాలా మంచిదండీ. మా అమ్మాయి లందరికీ ఇక్కడే పురుళ్ళు పోయించాను. ఈ అమ్మాయి నా కోడలు. వాళ్ళ వాళ్ళు తీసుకెళతామన్నా ఈ డాక్టరు మీద నమ్మకంతో మేము పంపలేదు" అన్నదామె.

రామారావు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

గాయత్రి గురించి చాలామంది చెప్పుకుంటుండగా తాను విని ఉన్నాడు. కొంతమంది ఇరుగు పొరుగువారు నలుగురు ఇతర డాక్టర్ల పేర్లు సూచించినా గాయత్రి మీద ఉన్న సదభిప్రాయంతో నర్సింగ్‌హోమ్ ఇంటికి దూరమైనా కూతురును ఇక్కడికే తీసుకొచ్చాడు. మనం నమ్ముతున్న వ్యక్తి గురించి నలుగురూ మంచిమాటలు చెప్పుకుంటుంటే ఎవరికైనా ఆనందంగానే ఉంటుంది కదా!

పన్నెండూ ఏభై అయింది. రామారావుకు పిలుపొచ్చింది. ఆత్రంగా కూతురును తీసుకుని లోపలకు వెళ్ళాడు.

గాయత్రిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆమెకున్న పేరు ప్రతిష్టలనుబట్టి ఆమెకు ఏ ఏభై సంవత్సరాల వయసో ఉండొచ్చనుకున్నాడు. తీరాచూస్తే ఆమెకు మూడు పదుల వయసున్నట్లు కూడా లేదు.

చాలా ప్రశాంతమైన ముఖం. చెదరని చిరునవ్వు. అలసట అన్నది ఏ కోశానా లేదు. నిశితంగా చూడగా ఆమెను ఇంతకుముందు ఎక్కడో చూసినట్లనిపిస్తున్నది. కానీ గుర్తు రావడంలేదు.

"నమస్కారం డాక్టరుగారూ" అన్నాడు.

గాయత్రి సీట్లోంచి దిగ్గున లేచింది. రెండు చేతులు జోడించి నమస్కరించింది.

"మీరు..మీరు..రామారావు మాస్టారు కదూ?" అన్నది ఆనందంతో.

"అవును. కానీ మీరెవరో గుర్తు రావడంలేదు" అసహాయంగా అన్నాడు రామారావు.

"నన్ను గుర్తుపట్టలేదా సార్..గాయత్రిని..చిన్నప్పుడు ఏడో తరగతి వరకు చక్రాయపాలెంలో మీదగ్గర చదువుకున్నాను.."

రామారావు ముఖం వెలిగింది.

"ఆ..! నువ్వు కమలమ్మ గారమ్మాయివా?" ఆశ్చర్యంగా అన్నాడు.

"అవునండీ! కూర్చోండి. కూర్చోండి. ఎంత కాలానికి కలిశారు? ఈ అమ్మాయి మీ అమ్మాయా? పంతులమ్మగారెలా ఉన్నారు? మీరు సర్వీస్‌లో ఉన్నారా? రిటైరయ్యారా? ఎక్కడుంటున్నారు?" ప్రశ్నల వర్షం కురిపించింది.

"నీ విద్యార్థి లక్షణం పోలేదు. క్లాసులో కూడా ఇలాగే ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తుండేదానివి. ఆ ఊళ్లో మాత్రం ఎలాగో ఎనిమిది సంవత్సరాలుంచారు. ఆ తరువాత మరో నాలుగూళ్ళు తిరిగి చివరకు అద్దంకిలో రిటైరయ్యాను. నా కొడుకు ఇక్కడే పనిచేస్తున్నాడు. మేమూ వాడి దగ్గరే ఉంటున్నాం. వీళ్ళమ్మకు కొంచెం నలతగా ఉంది. నేను మీ ఊళ్ళో పనిచేస్తున్నప్పుడు ఈ అమ్మాయి పుట్టలేదు. పేరు వసంత" చెప్పాడు రామారావు.

"చాలా సంతోషం మేస్టారూ. మేడమ్‌గారు కూడా వస్తే బాగుండేది" అన్నది గాయత్రి.

"నీకు పెళ్ళయిందమ్మా? మీవారేం చేస్తుంటారు?"

"అయింది సార్. ఆయన కూడా డాక్టరే. గవర్నమెంట్ హాస్పిటల్‌లో సర్జన్. ఇంత చదువూ చదివి ఈ గవర్నమెంట్ ఉద్యోగాలతో ఏం తింటాం? అందుకే నేనిక్కడ నర్సింగ్‌హోమ్ పెట్టాను."

"చాలా సంతోషం తల్లీ..మంచి డాక్టరుగా పేరు తెచ్చుకున్నావట! నీకు గురువునైనందుకు గర్వపడుతున్నాను."

"అంతా మీ దయే! అప్పుడు మీరు ప్రోత్సహించబట్టే నేనీనాడు డాక్టర్ని కాగలిగాను. అమ్మాయికి ఎన్నోనెల?"

"ఏడోమాసం వచ్చిందమ్మా..పురిటికి తీసుకొచ్చాను. నీ చేతుల్లో పెడుతున్నాను."

"ఏం భయంలేదు సార్. నేను చూసుకుంటాను. ఉండండి" అని గాయత్రిని లోపలి గదిలోకి తీసుకెళ్ళింది.

ఇరవై ఏళ్ళక్రితం గాయత్రి తన వద్ద చదువుకున్న వాతావరణం గుర్తుకు తెచ్చుకున్నాడు రామారావు. ఆ అమ్మాయి ఇంత ఎత్తుకు ఎదిగినా తనను మర్చిపోకపోవడం ఆయన ఆనందాన్ని రెట్టింపు చేసింది.

ఐదు నిమిషాల తర్వాత గాయత్రి, వసంతా బయటకు వచ్చారు. బెల్ కొట్టి నర్సును పిలిచింది గాయత్రి.

"ఇంకా ఎంతమంది ఉన్నారు" అడిగింది.

"ఎనిమిదిమంది ఉన్నారు డాక్టర్"

"అందరినీ సాయంత్రం రమ్మను. వెళ్ళు"

రామారావుకెక్కడో కలుక్కుమంది. అయినా మాట్లాడలేదు. బయట ఉన్నవారిలో తాను కూడా ఒకడు కానందుకు రామారావులోని సగటు మనిషి సంతోషించాడు.

"మాస్టారూ..అంతా బాగానే ఉన్నది. కాకపోతే అమ్మాయి కొంచెం నీరసంగా ఉన్నది. ఆమెకు మంచి బలవర్ధకమైన ఆహారం కావాలి. పండ్లరసాలు ఎక్కువగా ఇవ్వండి. ఆపిల్స్ బాగా తినిపించండి. ఒకపూట ప్రోటినెక్స్, ఒకపూట హార్లిక్స్ ఇవ్వండి. పాలల్లో కుంకుమ పువ్వు వేసి ఇస్తే మీకు బంగారం లాంటి మనుమడు పుడతాడు" నవ్వుతూ అన్నది గాయత్రి.

"సంతోషం. మందులేమైనా రాస్తావా?"

"రాస్తాను. అమ్మాయికి కంప్లీట్ బెడ్‌రెస్ట్ అవసరం. మోటు పనులు చెయ్యనివ్వద్దు. బలానికి మందులు రాస్తాను. వాటికి తోడుగా ఫ్రూట్ జ్యూస్ లాంటివిస్తే ఇంకా బాగుంటుంది. తొమ్మిదోనెల వచ్చేవరకూ పదిహేను రోజులకొకసారి రండి. తరువాత వారానికోమారు రండి. అవునూ అడగటం మర్చిపోయాను ఎంతసేపయింది మీరొచ్చి?"

"ఉదయం తొమ్మిది గంటలకు వచ్చాం. అప్పటికే దాదాపు పాతికమంది ఉన్నారు."

"మైగాడ్! అయాం సారీ సార్. ఈసారి మీరు వచ్చేటపుడు మధ్యాహ్నం రెండుగంటలకు రండి. అపుడు నేను తీరిగ్గా ఉంటాను. ఇంటికి వెళ్దాం రండి" లేస్తూ అన్నది గాయత్రి.

"ఎక్కడమ్మా ఇల్లు?"

''ఫస్ట్ ఫ్లోరే. రండి'' నడవసాగింది గాయత్రి.

గాయత్రి ఇల్లు చాలా అధునాతనంగా ఉంది. అంతా మార్బుల్ ఫ్లోరింగ్. మెత్తని సోఫాలు. ఎన్నో అందమైన అక్వేరియం, స్టూల్స్‌మీద ఫ్లవర్ వేజ్‌లు.. అద్దంలా ఉంది. సంపాదన బాగా ఉందని అణువణువూ చెబుతున్నాయి.

భోజనం చెయ్యమని బ్రతిమలాడింది. తప్పని సరై టిఫిన్ చేశారు తండ్రీకూతుళ్ళు. వెళ్ళబోతుండగా చీర, జాకెట్ పీస్, వెండి కుంకుమ భరిణ ప్రజెంట్ చేసింది.

ఆ తరువాత మరో నాలుగుసార్లు వెళ్ళారు తండ్రీకూతుళ్ళు. ప్రతిసారీ అదే ఆదరభావం చూపింది గాయత్రి. ప్రతిసారీ పండ్లరసాలు, బెడ్ రెస్ట్, కుంకుమ పువ్వు గురించి చెబుతుండేది.

నవమాసాలు నిండగానే ఈజీ డెలివరీ చేయించింది. ఫీజు నయాపైసా పుచ్చుకోలేదు.

''ఈ రోజుల్లో ప్రతి డాక్టరూ అవసరం లేకున్నా సిజేరియన్ చేస్తూ వేలకు వేలు డబ్బు గుంజుతున్నారు. నీవు మాత్రం నన్ను ఆర్థికంగా నిలబెట్టావు. కృతజ్ఞుడిని. ఎంత వద్దనుకున్నా, సందర్భం కాకపోయినా, బడిపంతులుగా నేను రిటైరైనా, ఆ పంతులు బుద్ధి మాత్రం పోవడం లేదు. నువ్వు ఏమీ అనుకోనంటే మళ్ళీ నీకో పాఠం చెప్పాలనుంది'' అన్నాడు రామారావు.

''ఏమిటది మాస్టారూ?'' అన్నది గాయత్రి వినయంగా.

గాయత్రి గుటకలు మింగుతూ వినసాగింది.

''మా తరంలో మా అమ్మలెవరూ బెడ్‌రెస్ట్‌లు ఎరగరు. అయినా మేము ఆరోగ్యంగానే పుట్టాము. నా భార్య ఎప్పుడైన అరటిపళ్ళు తిన్నదేమో.. ఇక కుంకుమ పువ్వు పేరే తెలియదు. అయినా నలుగురు పిల్లలను శుభ్రంగా కన్నది. వాళ్ళలో ముగ్గురు దబ్బపండు ఛాయ.

వసంతకు పాలు, పండ్లు ప్రొటినిక్స్‌లు ఇవ్వమని చాలాసార్లు చెప్పావు. నేను తలూపాను. కానీ మేం అలాంటివేమీ ఇవ్వలేదు. గ్రాము నలభై రూపాయలు పలికే కుంకుమ పువ్వును లీటరు పాలు పదిహేడు రూపాయలు పెట్టి కొంటున్న నాలాంటి మధ్యతరగతివాళ్ళు పిల్లలకివ్వగలరా? రోజుకి పదిరూపాయలు ఖర్చుపెట్టి యాపిల్ జ్యూస్ ఇవ్వడం మాకు సాధ్యమేనా?

నిజానికి వీటివల్ల మాత్రమే ఉపయోగం ఉంటుందా?

నిత్యం మనం తీసుకునే మామూలు ఆహారం, ఆకు కూరల్లోనే సమృద్ధికరమైన పోషక పదార్థాలు, విటమిన్లు ఉంటాయని శరీరఛాయ అనేది వంశపారంపర్యంగా వస్తుందని విషయం నీకు తెలియదా? తెలిసినా ఇలాంటి సలహాలిచ్చి ఎందుకు నీ పేషంట్లను తప్పుదోవ పట్టిస్తున్నావు?'' ప్రశ్నించేడు.


గాయత్రి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

''పొరపాటైతే క్షమించమ్మా.. పెద్దవాడిని. చాదస్తంగా మాట్లాడాను. కేవలం చనువుతోనే..'' అన్నాడు రామారావు.

''సారీ మాస్టారూ.. ఒక విషయం చెబుతా.. కొబ్బరి బోండాలమ్మే దుకాణం ఒకటుంటుంది. కస్టమర్ వచ్చినపుడల్లా ఒకటి ఏరి ఏరి తీసి చెవి వద్ద ఊపి మనకు కొట్టిస్తాడు. మరొకడు వస్తే ఆ బొండాల నుంచే మరొకటి ఏరి అటు ఇటు ఊపుతాడు. నిజానికి ఏ బొండంలో ఎన్ని నీళ్ళుంటాయో వాడిని పుట్టించిన బ్రహ్మకు కూడా తెలియదు. ఈ తంతు చూసి ఒకరోజు వాడి పదేళ్ళ కూతురు అడిగిందట నాన్నా అలా చెవి దగ్గర ఊపితే ఏం తెలుస్తుంది'' అని.

దానికి వాడు నవ్వి ''అమ్మా. నాకేం తెలియదు. కానీ అలా చేస్తే కస్టమర్స్ తృప్తిగా తీసుకుంటారు. వారికి ప్రత్యేక శ్రద్ధతో మంచి బోండం ఏరి ఇచ్చామనుకుంటారు'' అన్నాడట. ఇదీ అంతే! నా దగ్గరకు వచ్చేవారిలో తొంభైశాతం మంది ఒకటి రెండు కాన్పులు కన్నవారే. గర్భవతి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వారికి తెలుసు. అయినా నేను చెప్పాలి. ఏం భయం లేదు. జ్యూస్‌లు వద్దు. రెస్టు వద్దు. మామూలుగా తింటూ తిరగండి అని చెబితే రెండోసారి వాళ్ళు రారు. మామూలుగా ఒక డాక్టరు ఎలాంటి సలహా ఇస్తారు అనే విషయం వారి మనసులో ఉంటుంది. అది గ్రహించి మేం మాట్లాడాలి. ముఖ్యంగా మధ్యతరగతివాళ్ళలో ఈ భావం ఎక్కువ. వారితో జమకట్టి మీకూ అలాగే చెప్పాను. క్షమించండి'' అంది డాక్టర్ గాయత్రి.

★



ఇలపావులూరి మురళీమోహనరావు